క్లుప్తంగా

పేదల సంక్షేమమే ధ్యేయం
ఎమ్మెల్యే రోహిత్‌రావు


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

హవేళిఘణాపూర్(మెదక్):/మెదక్‌జోన్: మెదక్ మండల పరిధిలోని బాలానగర్‌లో పంచాయతీ భవనం, పశువులపాకలను శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, శంకర్, చంద్రపాల్, నరేష్ తదితరులు ఉన్నారు. మెదక్ పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించారు.

'ఉపాధి'తో షెడ్ల నిర్మాణాలు


పనులు ప్రారంభిస్తున్న అధికారులు

చేగుంట(తూప్రాన్): ఉపాధిహామీ పనులతో పశువుల పాకలు కోళ్లఫారం షెడ్ల నిర్మాణాలను చేపడుతున్నట్లు మండల ప్రత్యేక అధికారి హైమావతి అన్నారు. శుక్రవారం మండలంలోని జెత్రంతండాలో ఉపాధిహామీ కోళ్లఫారం షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ పశువుల పాకలు, కోళ్లపాకలు, గొర్రెల పాకలు, ఇంకుడు గుంతల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంపీఓ నరేష్, నాయకులు సుభాష్ నాయక్, మోహన గణేష్, రమేశ్ పాల్గొన్నారు.

ఊరూర పనుల జాతర


చిట్కుల్‌లో పనుల జాతర కార్యక్రమంలో అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తయిన పనులను ప్రారంభించడంతో పాటు, చేయాల్సిన పనులకు శంకుస్థాపన చేశామని జిల్లా పౌరసరఫరాల, మండల ప్రత్యేకాధికారి నిత్యానంద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో తప్పనిసరిగా మూడు పనులు చేయాల్సి ఉందన్నారు. పలు గ్రామాలలో పూర్తయిన పశువుల పాక, కోళ్ల షెడ్లను అధికారులతో కలసి ప్రారంభించామన్నారు. గ్రామాలలో చేయాల్సిన కమ్యూనిటీ సోక్‌పిట్, గొర్రెల, మేకల షెడ్లు, కోళ్ల పెంపకం షెడ్లకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రశాంత్, ఏపీఓ శ్యామ్, ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి పాల్గొన్నారు.

చండూర్ గెజిటెడ్ హెచ్‌ఎంగా రమేష్


హెచ్‌ఎం రమేష్‌ను స్వాగతిస్తున్న సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన దాండిగె రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించారు. పదోన్నతి పొందడంతో, ఆయన చండూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. కాగా చిలప్‌చెడ్ ఉన్న పాఠశాల సిబ్బంది, ఎంఈఓ విఠల్ ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ విఠల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా తిరుమల్లయ్యపాలెం ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏగా పనిచేసిన దానమూర్తి చిలప్‌చెడ్ హెచ్‌ఎంగా విధుల్లోకి చేరారన్నారు.

పంట మార్పిడి తప్పనిసరి
రైతులకు వ్యవసాయ విద్యార్థుల అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినీలు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు పంట మార్పిడి చేస్తేనే అధిక దిగుబడులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందని వ్యవసాయ విద్యార్థినిలు అన్నారు. శుక్రవారం మండల పరిధి పెద్దగొట్టిముక్ల గ్రామంలో మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినీలు రైతులకు ఆధునిక సాగు విధానం గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని రైతులకు విద్యార్థినిలు దివ్యకారుణ్య, లహరి, హారిక, మధు, కవిత సూచించారు.


శివ్వంపేట: పెద్దగొట్టిముక్లలో క్యూలైన్‌లో రైతులు


కౌడిపల్లి: మహమ్మదనగర యూరియా కోసం ఎగబడిన రైతులు

అదే వరుస.. అదే అవస్థ

యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు

అన్నదాతలకు యూరియా కష్టాలు తప్పడం లేదు. రోజురోజుకు ఈ సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. అన్నీ పనులు వదులుకొని రైతులు యూరియా కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. కనీసం బస్తా యూరియానైనా దొరుకుతుందా లేదా అనేది గ్యారెంటీ లేకుండా పోయింది. ఎక్కడ చూసినా పెద్ద క్యూలు దర్శనమిస్తున్నాయి. అధికారులు మాత్రం యూరియా కొరత లేదని చెబుతున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్)/కౌడిపల్లి(నర్సాపూర్)/పాపన్నపేట(మెదక్)/నర్సాపూర్: శివ్వంపేంట మండల పరిధిలోని పెద్దగొట్టిముక్లలో శుక్రవారం రైతులు యూరియా కోసం అనేక అవస్థలు పడ్డారు. ఫర్టిలైజర్ దుకాణానికి 300 బస్తాల యూరియా రావడంతో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పోలీసు బందోబస్తు మధ్య టోకెన్లు ఉన్న రైతులకు పంపిణీ చేశారు. సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే.. కౌడిపల్లి మండలం మహమ్మద్‌నగర్ పీఏసీఎస్‌కు 500 బస్తాల యూరియా వచ్చింది. ఏఓ స్వప్న, ఏఈఓలు ప్రవంతి, సాహితి, సొసైటీ సీఈఓ దుర్గాగౌడ్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి బస్తా యూరియాకు టోకెన్లు ఇచ్చారు. దీంతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి రైతులను క్యూలో నిలబెట్టి యూరియా పంపిణీ చేయించారు. పాపన్నపేట మండలం చీకోడ్ సొసైటీలో అధికారుల సమక్షంలో యూరియా విక్రయించారు. ఒక్కో రైతుకు సంచి చొప్పున 440 బ్యాగులు పంపిణీ చేశారు. నర్సాపూర్‌లో యూరియా అమ్మకాలను తహసీల్దార్ శ్రీనివాస్, వ్యవసాయాధికారి దీపిక పరిశీలించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియాను విక్రయించారు. ఉన్నంత స్టాక్ రైతులకు అందజేయాలన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

డీఎస్పీ నరేందర్‌గౌడ్

తూప్రాన్: గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పోలీస్ సర్కిల్ పరిధిలోని శివ్వంపేట, వెల్దుర్తి, మనోహరాబాద్, తూప్రాన్ మండలాలకు చెందిన గణేశ్ మండపాల నిర్వాహకులతో పీస్ కమిటీ నిర్వహించారు. ఈసందర్భంగా మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జన కార్యక్రమం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. డీజేకు అనుమతి లేదని ఎవరైనా ఏర్పాటుచేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐ రంగాకృష్ణ, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మర్పల్లి వంతెనకు రూ.5కోట్లు

సాక్షి ఎఫెక్ట్..

రేగోడ్(మెదక్): ×వంతెన నిర్మాణం ఇంకెన్నాళ్లు ।శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. మర్పల్లి వద్ద వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు మంత్రి మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, పీసీసీ సభ్యుడు ఎం.కిషన్ శుక్రవారం తెలిపారు. వంతెన నిర్మాణానికి దామోదర త్వరలో భూమి పూజ చేస్తారని చెప్పారు.నిర్మాణం పూర్తి అయితే ఆయా గ్రామాల ప్రజలకు మరింత రవాణ సౌకర్యం మెరుగు పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.


వంతెన నిర్మాణం ఇంకెన్నాళ్లు..?

సాక్షిలో ప్రచురితమైన కథనం

బీజేపీ నేత ముందస్తు అరెస్టు

నర్సాపూర్: బీజేపీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో సచివాలయం కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిన విషం తెలిసిందే. ఈ క్రమంలో ముందస్తు చర్యగా మల్లేష్‌గౌడ్‌తో పాటు పార్టీ నేతలు రాజు, చంద్రయ్యలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

రైతులను ఆదుకోండి
బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్

కౌడిపల్లి(నర్సాపూర్): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ కృష్ణకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో గ్రామాలలో రైతులు నష్టపోయిన పంటకు, ఇండ్లు కూలిన వారికి పరిహారం ఇవ్వాలన్నారు. రైతులకు సరిపడా యూరియా కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌గౌడ్, బుచ్చేష్‌యాదవ్, కృష్ణ, రవి, పాపయ్య, మల్లేశం, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు


దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెద్దశంకరంపేట(మెదక్): దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వైద్యులు త్రుషా కాంబెల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓలు వెంకటేశం, ధనుంజయ అన్నారు. పెద్దశంకరంపేటలోని భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఉపకరణాలు అవసరమైన వారిని గుర్తించారు. త్వరలో వారికి ఉపకరణాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థుల సంక్షేమానికి చర్యలు చేపడుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు షరీఫొద్దీన్, సీఓ తుషార్, ఐఈఆర్పీ ఉపాధ్యాయులు రవికిరణ్, రాజు, ఫిజియోథెరఫిస్ట్ ప్రసన్నలక్ష్మి తదితరులు ఉన్నారు.

రూ.12 కోట్లు మంజూరు చేయండి

మంత్రి దామోదర ప్రతిపాదనలు

పాపన్నపేట(మెదక్): నార్సింగి–పెద్దశంకరంపేట రోడ్డుకు రూ.12 కోట్లు మంజూరు చేయాలంటూ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌కు ప్రతిపాదనలు పంపారు. పాపన్నపేట మండలం నార్సింగి నుంచి పెద్దశంకరంపేట వరకు గతంలో రోడ్డు మంజూరైంది. కానీ సంబంధిత కాంట్రాక్టర్ కొంత మేర పనులు చేసి వదిలేశారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరిక మేరకు, రోడ్డు భవనాల శాఖ మంత్రి రూ.12 కోట్లతో ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌కు నోట్ పంపారు. వీటితో పాటు టేక్మాల్–ధన్నూర రోడ్డుకు రూ.3 కోట్లు, కొత్తపల్లి –చింతకుంట రోడ్డుకు రూ.5 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి


భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

అల్లాదుర్గం(మెదక్): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి అన్నారు. శుక్రవారం అల్లాదుర్గంలో పనుల జాతరలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, ఉపాధి హమీ పథకం కింద సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు బాలకిషన్, బీతయ్య, కార్యదర్శి ప్రభాకర్ , ఫీల్డ్ అసిస్టెంట్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


ఏపీఎంను సన్మానిస్తున్న దృశ్యం

ఐకేపీ ఏపీఎం సంగీత

కౌడిపల్లి(నర్సాపూర్): డ్వాక్రా గ్రూపులను సక్రమంగా నిర్వహించాలని ఐకేపీ ఏపీఎం సంగీత తెలిపారు. శుక్రవారం ఐకేపీ మండల సమాఖ్య వార్షిక మహాసభలో ఆమె మాట్లాడారు. మండలంలోని 694 డ్వాక్రా గ్రూపులు ఉండగా.. ఇందులో 7,226 మంది సభ్యులు ఉన్నట్లు చెప్పారు. 2024–25లో మండల సమాఖ్యకు రూ 1.04లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రతి గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు చెల్లించడంతోపాటు పొదుపు చేయాలన్నారు. మొండి బకాయిలు వెంటనే చెల్లించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఇటీవల ఇక్కడి నుంచి నర్సాపూర్‌కు బదిలీపై వెళ్లిన ఏపీఎం సంగమేశ్వర్‌ను మండల సమాఖ్య తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పుణ్యమ్మ, కార్యదర్శి రాధిక, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాలో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రవీందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కాళ్లకల్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మనోహరాబాద్‌లో సీసీ రోడ్డు, పలు గ్రామాలో సైతం గ్రామ ప్రత్యేక అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏపీఓ ఆదినారాయణ పాల్గొన్నారు.


కాళ్లకల్‌లో పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు

'ఉపాధి' పనులతో ప్రయోజనం

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ పనులతో ప్రయోజనం చేకూరుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కౌడిపల్లి, కూకుట్లపల్లి గ్రామాలలో ఉపాధిహామీ పథకం పనుల జాతరను ప్రారంభించి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు కూలి పనులతో పాటు పండ్ల తోటల పెంపకం, ఇంకుడు గుంతలు, పాంపండ్, పశువులు గొర్ల షెడ్లు, మట్టిరోడ్లు, తదితర వ్యక్తిగత, సామాజిక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా కౌడిపల్లిలో జెట్టి లక్ష్మికి ఇంకుడుగుంతకు ముగ్గువేసి పనులు ప్రారంభించారు.కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం , నాయకులు పాష, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనమహోత్సవం సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు.

అమ్మపేరిట మొక్క నాటిన విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు అమ్మ పేరిట ఒక్క మొక్క నాటారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. నాటిన మొక్కలను సంరక్షిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మార్కండేయులు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

అల్లాదుర్గం(మెదక్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎస్‌ఐ శంకర్ సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.


శివ్వంపేట(నర్సాపూర్): పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న పోలీసులు


కౌడిపల్లి: వెల్మకన్నలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు


అల్లాదుర్గం(మెదక్): స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న ఎస్‌ఐ

సంక్షిప్త వార్తలు

◆ **ఘనంగా శివపార్వతుల కల్యాణం**

టేక్మాల్(మెదక్): మండలంలోని దనూర కాశీవిశ్వేరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించి, అమ్మవారికి ఒడి బియ్యాన్ని పోశారు. కాశీ విశ్వేరుడికి అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **కబ్జాకు గురైన భూమిని కాపాడాలి**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల గ్రామపంచాయతీ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు 20, 60లో దాదాపు మూడెకరాల భూమిని కబ్జా చేశారని, దీని వెనకాల పెద్దల హస్తం ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు హరీష్ ఆరోపించాడు. కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శివప్రసాద్, మహేష్ యాదవ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

◆ **అభివృద్ధి పనులకు శ్రీకారం**

కొల్చారం(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతరలో భాగంగా మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. పోతిరెడ్డిపల్లిలో ఉపాధి హామీలో భాగంగా నూతన చెక్ డ్యాం నిర్మాణానికి ఎంపీఓ కృష్ణవేణి శంకుస్థాపన చేశారు. పశువుల పాక, పౌల్ట్రీఫాం షెడ్‌లను ప్రారంభించారు. సదాశివ నగరంలో రంగంపేట గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీకాంత్ పశువుల పాక నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు భూమేష్, రాజు, ఉపాధి హామీ సిబ్బంది సువార్త, పోచయ్య, యదుల్లా, శేఖర్ రెడ్డి, రూప్లా పాల్గొన్నారు.

◆ **రంగంపేట ఆశ్రమం సందర్శన**

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట శ్రీ మాధవనంద స్వామి ఆశ్రమాన్ని శుక్రవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి సందర్శించారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులు పొందారు. వీరి వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మాజీ సర్పంచులు సుజాత, వెంకట్ గౌడ్, నాయకులకు శ్రీధర్ గుప్తా, కృష్ణ, ఉన్నారు.

◆ **ఉపాధి పనుల జాతర**

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన టేక్మాల్‌లో గ్రామసభ నిర్వహించి గత సంవత్సరంలో నిర్వహించిన పనుల గురించి చర్చించారు. నూతన సంవత్సర పనుల ప్రణాళికతో పాటు ప్రారంభోత్సవాల వంటి అంశాలను గురించి చర్చించారు. ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఇందులో ఈఓ రాకేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వీరప్ప, నాయకులు కిషోర్, భాస్కర్, పాపయ్య, సాగర్, రాజు, అశోక్, శివమల్లయ్య తదితరులు ఉన్నారు.

◆ **రోడ్ల అభివృద్ధికి రూ.20 కోట్లు**

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండల ప్రధాన రోడ్ల నిర్మాణ పనులకు రూ.20 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మరమేష్ తెలిపారు. చింతకుంట నుంచి కొత్తపల్లి వరకు రూ.5కోట్లు. దనూర నుంచి టేక్మాల్ చౌరస్తా వరకు రూ.3కోట్లు, నార్సింగి నుంచి పెద్దశంకరంపేట వరకు రూ.12కోట్లు మంజూరైనట్లు చెప్పారు. త్వరలో మంత్రి దామోదర రాజనర్సింహ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

◆ **సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు శ్రీకాంత్, వీరేందర్, వీరేష్, చంద్రశేకర్ తదితరులు ఉన్నారు.

◆ **నిబంధనలు పాటించాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని ఏఎస్‌ఐ సాయిలు అన్నారు. శుక్రవారం సాయంత్రం తూప్రాన్–నర్సాపూర్ హైవేపై వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమాన విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని , సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు.

◆ **శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

శివ్వంపేట(నర్సాపూర్): పనుల జాతర మహోత్సవం సందర్భంగా మండలంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ పెద్దగొట్టిముక్లలో పశువుల పాకలు ప్రారంభించారు. అలాగే.. సీతారం తండాలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ భాస్కర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, నవీన్‌గుప్తా, శ్రీశైలంయాదవ్, కమలపూల్‌సింగ్, రవినాయక్ పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు వైద్యపరీక్షలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కౌడిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఫెర్నాజ్ చికిత్సలు చేశారు. ప్రతి నెల విద్యార్థులకు చికిత్సలు నిర్వహిస్తామన్నారు. వాతావరణ మార్పుల వల్ల జలుబు, జ్వరం ఇతర ఆరోగ్య సమ్యలు వచ్చే అవకాశం ఉందని, అందుకే పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, భోజనశాల, పరిసరాలను పరిశీలించారు.

◆ **విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ**

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని మంభోజిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గతంలో టీచింగ్ ప్రాక్టీస్ చేసిన విద్యార్థి చైతన్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్లేట్లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం నర్సింలు తెలిపారు. గతంలో టీచింగ్ ప్రాక్టీస్ చేసిన సమయంలో విద్యార్థుల ఉత్సాహాన్ని చూసి తనవంతుగా సాయం చేయాలని నిర్ణయించి, ఇప్పుడు అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కవిత, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **క్రీడా పోటీలు ప్రారంభం**

మనోహరాబాద్(తూప్రాన్): మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను మనోహరాబాద్‌లోని జేఎంజే పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎంఈఓ మల్లేశం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొన్నారు. మొదటి రోజు వాలీబాల్ క్రీడలు నిర్వహించినట్లు పీడీ మంజుల తెలిపారు.

◆ **అభివృద్ధి పనులు ప్రారంభం**

పెద్దశంకరంపేట(మెదక్): పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో అభివృద్ధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. పశువుల షెడ్లు, సీసీ రోడ్లు ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు ప్రారంభించి కార్మికులను సన్మానించారు.

◆ **బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు**

పెద్దశంకరంపేట(మెదక్): యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ, తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో హాకా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా యూరియా స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌.ఐ.రమేష్, ఏఈఓలు వినీత్, అఖిల్, మమత ఉన్నారు.